క్లుప్తంగా

యాసంగి పంట వివరాలు నమోదు



పంట వివరాలు నమోదు చేస్తున్న డీఏవో

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం డీఏవో శ్రీనివాస్ యాసంగిలో పండించే పంటల వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్దకు వెళ్లి గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యాసంగిలో పండించే ప్రతీ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవో షేక్ ఖలీల్, రైతులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కైలాష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

లింగాపూర్: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊషన్న, ఇందోరావు తెలిపారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ కైలాష్, ప్రధాన కార్యదర్శిగా పేందూర్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సాయిరాం, మహిళా అధ్యక్షురాలిగా కోట్నాక నాగమణి, కార్యదర్శులుగా సరస్వతి, మైనోద్దీన్, బిందు, శైలజాలను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: మండలంలోని చిన్న సాకడ గ్రామంలో ఈ నెల 13 నుంచి నిర్వహించే కబడ్డీ క్రీడా పోటీలకు హాజరు కావాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో కలిసి ఆహ్వానించారు. నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, తుకారాం, సోము తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

బెజ్జూర్: పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్.అరుణ, మండల అధ్యక్షులుగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, రవీంద్ర, లావణ్య, మహిళా ఉపాధ్యక్షులుగా అనిత, కార్యదర్శులుగా లావణ్య, నాగమణి, దేవకిషన్, మహిళా కార్యదర్శులుగా పియాంక, మీడియా కన్వీనర్‌గా రవిలను ఎన్నుకున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత




పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ విమలబాయి

వాంకిడి: పులాజీ బాబా చూపిన ధ్యాన మార్గంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. మండలంలోని నార్లపూర్ గ్రామంలో బుధవారం పూలాజీ బాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షుడు కేషవ్ ఇంగ్లే పాల్గొని బాబా ప్రవచనాలను భక్తులకు వివరించారు.

ప్రముఖ వైద్యుడు మధు మృతి

కాగజ్‌నగర్‌టౌన్: నియోజకవర్గ ప్రజలకు విశేష వైద్య సేవలు అందించిన డాక్టర్ వాసిరెడ్డి మధు బుధవారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన చర్మ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

పత్తి విక్రయానికి బారులు



బారులు తీరిన వాహనాలు

కౌటాల: మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించేందుకు రైతులు బారులు తీరారు. కౌటాలలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతుండగా గత మూడు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిపివేశారు. బుధవారం కొనుగోళ్లు తిరిగి ప్రారంభించగా పెద్ద ఎత్తున రైతులు పత్తి విక్రయించేందుకు వచ్చారు. రైతులు బొలేరో, వ్యాన్లు, ట్రాక్టర్ల ద్వారా పత్తిని తీసుకొని రాగా గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

'రైతుబంధు' అందేదెప్పుడో..?

- పెట్టుబడి సాయం అందక తిప్పలు
- ఇప్పటి వరకు అందింది 3743 మందికే..
- ఎదురుచూస్తున్న 5043 మంది రైతులు



యాసంగి వరి సాగు కోసం సిద్ధంగా నారు

రెబ్బెన: పంట పెట్టుబడుల కోసం రైతులు ఎవరిపై ఆధారపడకుండా గత ప్రభుత్వం రైతుబంధు పథకం ప్రవేశపెట్టింది. రెండు సీజన్లలో పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం సైతం రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు నిర్ణయించి గత నెల 12 నుంచి రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే పథకం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికీ చాలా మంది రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటి వరకు 3,743 మందికే..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో రైతుబంధు అర్హులు 12,676 మంది ఉన్నారు. వారికి ఎకరానికి రూ. 5వేలు చొప్పున రూ.18.85 కోట్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీరిలో 11,865 మంది రైతులు మాత్రమే బ్యాంకు ఖాతాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించారు. వాటిని అధికారులు పరిశీలించి 8,786 మంది రైతుల వివరాలను ట్రెజరీకి పంపించారు. వారికి రూ.7,87,78,218 చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 3,743 మంది రైతులకు రూ.1,71,15,965లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మొదటి రోజు అర ఎకరం విస్తీర్ణం ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందించగా ఇప్పటి వరకు 1.5 ఎకరాల వరకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించింది. ఇందులోనూ 1.5 ఎకరం లోపు ఉన్న కొంతమంది రైతులకు నేటికీ పెట్టుబడి సాయం అందలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఊపందుకున్న యాసంగి పంటల సాగు..

మండలంలో యాసంగి పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. యాసంగిలో అత్యధికంగా 2100 ఎకరాల వరకు వరి సాగు చేపడుతుండగా ఇతర పంటలు మరో 500 ఎకరాల వరకు ఉండొచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే బోరు మోటర్ల కింద వరినాట్లు కొనసాగుతుండగా, కొంత మంది రైతులు నార్లు పోసుకొని చూస్తున్నారు. అయితే రైతుబంధు పంపిణీ ప్రక్రియ ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా నేటికీ సాయం అందకపోవటంతో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. వరి నాట్లు, పొలంలో దుక్కి, దమ్ము చేసే ట్రాక్టర్ కిరాయిలు, కూలీలకు చెల్లింపుల వంటి ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు ఆర్థికంగా తిప్పలు పడుతున్నారు. నెల రోజులుగా పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నా బ్యాంకు ఖాతాలో జమ కాకపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సకాలంలో సాయం అందితే ఉపయోగకరంగా ఉంటుందని, అధికారులు త్వరితగతిన రైతుబంధు డబ్బులు అందించేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే జమ



ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు పెట్టుబడి సాయం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. మండలంలో అర్హులైన రైతులను గుర్తించి బ్యాంకు ఖాతాలు ఇచ్చిన ప్రతీరైతు వివరాలను ట్రెజరీకి పంపించాం. డిసెంబర్ 12 నుంచి మండలంలోని రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం అందుతోంది. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే డబ్బులు జమవుతాయి.

- మంజుల, ఏవో

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో రాజకీయాలకతీతంగా మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. వ్యవసాయం, ఆరోగ్యం, పంచాయతీరాజ్, పశువైద్యం, ఉపాధిహామీ తదితర శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో వివరించారు. మండలంలో మొత్తం 55 పాఠశాలలకు గాను 45 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎంఈవో భిక్షపతి సభా దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ రామారావు మాట్లాడుతూ డెప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను అవసరమైన చోటకు పంపించాలన్నారు. మురళీగూడ, దేవులగూడ, తండా, టేపర్‌గాం, దేవాజీగూడ, మెత్యం, బొప్పురం గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేవని సభా దృష్టికి తీసుకురాగా వాటికి సంబంధించిన నివేదికలను తయారు చేయాలని, ప్రత్యేక నిధులు తెచ్చి గ్రామాలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిఖీ, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళారులకు పత్తిని అమ్మి రైతులు నష్టపోవద్దన్నారు. మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, మార్కెట్ యార్డు కార్యదర్శి భాస్కర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, నాయకులు శ్రీశైలం, వీరభద్రచారి, శ్రీనివాస్, పుల్ల అశోక్, ప్రసాద్, తిరుపతి, దోతుల శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపులు.. ప్రమాద పిలుపులు

- ప్రమాదకరంగా మూలమలుపులు
- కానరాని సూచిక బోర్డులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు




మొర్రిగూడ ఘాట్ సెక్షన్ వద్ద మూలమలుపు

తిర్యాణి: మండల కేంద్రం నుంచి మంచిర్యాల వైపునకు వెళ్లే దారిలో ఉన్న ఘాట్ సెక్షన్‌లో ప్రమాదకరంగా మూలమలుపులు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు మంచిర్యాల జిల్లాలోని ఐబీ, తాండూర్, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. మూలమలుపుల కారణంగా గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు సైతం ఉండడంతో మండలవాసులు ఆందోళన చెందుతున్నారు.

హెచ్చరిక బోర్డులు కరువు..

మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్ వద్ద గల ప్రమాదకరమైనా మూలమలుపుల వద్ద అధికారులు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చే వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారికి ఈ మార్గంలో వాహనాలు నడపడం కూడా కష్టమవుతుంది. గతంలో మండల కేంద్రం నుంచి మంచిర్యాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటి సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్ద ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు ముందుస్తుగా మూలమలుపుల వద్ద హెచ్చరిక సూచిక బోర్డులతో పాటుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రం నుంచి ఐబీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న మూలమలుపుల వద్ద వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నాం.

- తోడసం భాస్కర్, తిర్యాణి

స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి



ఐబీ(తాండూర్) మీదుగా కొత్తగా మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు మూలమలుపుల మీదుగా ప్రయాణించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. మూలమలుపుల వద్ద వాహనాల వేగాన్ని నిరోధించడానికి అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

- సార రమేశ్‌గౌడ్, గడలపెల్లి

పోరుగర్జన సభను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: టీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే పోరుగర్జన మహా సభను విజయవంతం చేయాలని టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో పోరు గర్జన మహా సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ.5వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇతర డిమాండ్ల సాధన కోసం నిర్వహించే పోరుగర్జన మహాసభ కార్యక్రమానికి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, వినోద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గంగాపూర్ కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో రజిత అన్నారు. బుధవారం పాఠశాలలో మెగా హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. బాలికల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ అన్ని కేజీబీవీల్లో మెగా హెల్త్ చెకప్ క్యాంపులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీటీసీ హరిత, కళాశాల, పాఠశాల అధ్యాపకులు హిమబిందు, పుష్పలత, లక్ష్మి, పుష్ప, మౌనిక, జహేరాబాను, ఏఎన్ఎం సరోజ, అకౌంటెంట్ జ్యోతి, పీఈటీ స్వప్న పాల్గొన్నారు.

వాంకిడి: ఆడ పిల్లలకు చదువే రక్షగా నిలుస్తుందని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆడ పిల్లలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఆదర్శవంతంగా నిలదొక్కుకోవాలని సూచించారు. అనంతరం ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కేజీబీవీ ఎస్‌వో పద్మ, ఆర్బీఎస్కే వైద్యుడు డా.నరేందర్, హెచ్ఈవో పెందుర్ రవిదాస్, ఎల్‌టీ ప్రమోద్, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని మోడి కేజీబీవీలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య, విద్యా, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో కొనసాగిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సునంద తెలిపారు. ఈ కార్యక్రమం ఐదు రోజులు కొనసాగుతుందని, ప్రతిరోజు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. హెచ్ఎం స్వర్ణలత, కేజీబీవీ ఎస్‌వో మీనా కుమారి పాల్గొన్నారు.

బెజ్జూర్: విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి హాజరయ్యారు. డాక్టర్ సుజాత విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీ ఎస్‌వో అరుణ, ల్యాబ్ టెక్నిషియన్లు దిలీప్ కుమార్, రోజా, ఏఎన్ఎం శిరీష, కేజీబీవీ టీచర్స్ మంగమ్మ, కవిత, ఆనంద శీల, రాజమణి, మౌనిక, సునీత, శంకరమ్మ, రాజేశ్వరి, పీఈటీ చెంచులక్ష్మి పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ దీపక తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఈవో అశోక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన చదువు, భోజనం, ఇతర సౌకర్యాలకు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమ అధికారి సావిత్రి, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ఎస్‌వో నలంద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన

బెజ్జూర్: ఎంతో ప్రాచుర్యం ఉన్న క్రికెట్ క్రీడల్లో నిరంతర సాధన చేస్తేనే మెరుగైన ప్రదర్శన కనబర్చవచ్చని ఎస్సై విక్రమ్ అన్నారు. మండలంలోని ఎలుకపెల్లిలో గ్రామంలో స్వర్గీయ పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదువ లేదని, యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. పాల్వాయి శ్రావణ్ రావు, కొంద్ర మనోహర్ గౌడ్, భాస్కర్ రాజు, సామల తిరుపతి, ఉమ్మెర బాలకృష్ణ, మెస్రం రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.13లో బుధవారం మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పాల్వాయి పురుషోత్తంరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ప్రారంభించారు. రాంనగర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా, ఈజ్‌గాం ఎస్సై టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. నాయకులు గోవింద్ మండల్, అశుతోష్, మహదేవ్, సుజిత్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వాంకిడి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని సర్పంచ్ పెందుర్ పవన్ అన్నారు. బుధవారం మండలంలోని ఖమాన గ్రామపంచాయతీ పరిధిలో గల లింబారావుగూడ గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామ పటేల్ లింబారావు, రసూల్, కిషన్, హనుమంతరావు, కిస్మాత్ రావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, క్లీనర్లకు వేతనాలు పెంచాలి

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు లారీల డ్రైవర్లు, క్లీనర్లకు చట్ట ప్రకారం వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో డ్రైవర్లు, క్లీనర్లు రోజుకు 12 గంటల డ్యూటీ చేస్తున్నప్పటికీ వారికి చట్ట ప్రకారం కనీసం వేతనాలు దక్కడం లేదన్నారు. పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవటంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు దక్కడం లేదని పేర్కొన్నారు.


రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ సీఐ

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లి గ్రామానికి చెందిన ఎల్కరి శేఖర్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పెంచికల్‌పేట్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెబ్బెన: కొలాంల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు సూచించారు. సోనాపూర్‌లోని కొలాంగూడ, ఖైరిగూడ, గోలేటి పంచాయతీ పరిధి రేకులగూడ గ్రామాల్లోని కొలాంలను కలిసి ప్రత్యేక శిబిరాల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం కొలాంల సమీకృత భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఆర్ఐ ప్రేంకుమార్, పంచాయతీ కార్యదర్శులు జలందర్, మీనాక్షి పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి సహకరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా ఏర్పడిన జిల్లా అన్ని రంగాల్లో వెనుకంజలో ఉందని, జిల్లాలోని రైతుల అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ సహదేవ్ బోర్కడేకు రైతు సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. రైతు సంఘం నాయకులు కవాల్కర్ నారాయణ, మెంగ్రే ఆనంద్‌రావ్, సదు, గణపతి, రాములు ఉన్నారు.


ఓయూ డిగ్రీ ప్రవేశ గడువు పెంపు

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023 -24 సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశం కోసం ఈనెల 31 వరకు గడువు పెంచినట్లు కోఆర్డినేటర్ తూడురు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చన్నారు. డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్ష ఫీజు చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 17 వరకు గడువు ఉందన్నారు. ఇతర వివరాల కోసం 9866398678, 9494314314, 7382929651లపై సంప్రదించాలని కోరారు.

మహిళపై డీఆర్‌డీవోకు ఫిర్యాదు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామ పంచాయతీ బారెగూడ సెక్టర్ -2 అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయాగా విధులు నిర్వహిస్తూ అక్రమంగా పెన్షన్ పొందుతున్న శాంతాబాయిపై బుధవారం అదే గ్రామానికి చెందిన కోట వేణుగోపాల్ డీఆర్‌డీవో, ఎంపీడీవోలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ సదరు మహిళ ఆయాగా విధులు నిర్వహిస్తూ ఆసరా పెన్షన్ పొందుతుందని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవగాహన కల్పించేందుకు 'వికసిత్ యాత్ర'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తిర్యాణి: కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్, మండల అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్, బీజేపీ మాజీ సర్పంచ్ పగ్గు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిషోర్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెన్న కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శిగా నిజాంలు ఎన్నికయ్యారు. మొత్తం 128 మంది ఓటర్లు ఉండగా, కిషోర్ బాబుకు 71 ఓట్లు, యుసుఫ్ ఖాన్‌కు 57 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి కోసం తాజ్, నిజాం, సుజ్జులు పోటీ పడగా నిజాంకు 56 ఓట్లు, తాజ్‌కు 40 ఓట్లు, సుజ్జుకు 32 ఓట్లు వచ్చాయి.